
# చిన్నబోయిన బ్రతుకు

అనంత



"సచ్చినోడ! నీజిమ్మడ! ఈడ బెట్టిన సిల్లర కూడా తగలెట్టావా?" సుక్కమ్మ తిట్ల చిట్టా విప్పింది.

'తప్పేసుక్కా! సిల్లర సీమాలచ్చే. తగలెట్ట కూడదే! సెంపలేసుకో"

ఏ మొగానికి బయమూ బత్తీ కూడాను..! సురే! నాకు లచ్చిందే వంటే చాలా బత్తి."

"నీకు దెయ్యంపట్టింది...."

"మాటలు జాగర్తగా కానీయే......"

"అబ్బో!......

"సెంపపగులుద్ది"

"నీ కంతకన్నా ఏటి శాతనవుద్ది? సీ! సీ! సెత్కారిబతుకు..."

"ఈపు ఇమానం మోతమోత మోగుద్ది. వల్లకుండొసె...."

సామేలు గుడుసె తలుపు తీసుకుని పోయాడుబయటికి. సుక్క చక్రాల్లాంటి కళ్ళు కోపంతోనూ బాధతోనూ ఎర్రబడ్డాయి. ఉక్రోషంతో ఏడుపొచ్చింది. కాని, ఏడవకూడదు అని గట్టిగా ఓట్టుపెట్టుకుంది కనక తనని తనే సముదాయించుకుంది అమ్మో! ఏడిస్తే ఇంకేమన్నా ఉందా? చిన్నాకి ఏమన్నా అయితే!..... డాక్టర్ బాబు చెప్పాడు కదా!

చిన్నాకి ఆరనెలలప్పుడు ఒకసారి బాగా విరేచనాలైతే ఉమాపతి డాక్టరు గారి దగ్గరికి తీసుకెళ్ళింది. ఆయనకేమీ ఇయ్యక్కర్లేదు. మందులు కొనక్కరలేదు. మందులు కూడా ఆయనే ఇస్తారు. అందుకే ఆపేటలో ఉన్న వాళ్ళంతా ఆయన దగ్గరకే వెడతారు మందులకి. నాలుగు రోజులైనా విరేచనాలు తగ్గకపోతే ఆయన సుక్కని అడిగారు. "చిన్నాకి విరేచనాలు మొదలైన రోజు ఏం జరిగింది.? నువ్వెందుకైనా ఏడిచావా?" అని ఆరోజు సామేలు తాగివచ్చి తనని కొట్టటం, తను పోట్లాడటం, ఏడవటం, అన్నం వండకుండా పస్తుండటం అన్నీ చెప్పింది డాక్టరు బాబుకి. విన్న డాక్టరు గారు సుక్కతో చెప్పారు. "పిల్లలకి పాలిచ్చే తల్లులు ఏడవకూడదు బాధపడకూడదు పస్తుండకూడదు. అది పిల్లలకి మంచిది కాదు. ముఖ్యంగా పాలిచ్చేప్పుడు సంతోషంగా ఉండాలి. నువ్వు సంతోషంగా పాలివ్వు. వాడివిరేచనాలు తగ్గుతాయి." అని

అంతే! సామేలు గురించి పట్టించుకుకోటం, బాధపడటం మానింది. వెంటనే చిన్నా విరేచనాలు తగ్గాయి. మామూలుగా అయిపోయాడు.

లేక లేక, ఎన్నో మొక్కులు మొక్కాక, గంగానమ్మ

జాతర కూడాచేయించాక పెళ్ళయిన పదేళ్ళకి పుట్టాడు. వాడికి అమ్మోరి పేరే పెట్టుకుంది 'గంగా' అని చిన్నా పుట్టి గొడ్రాలని ముద్రపడిన సుక్కని 'సుక్కమ్మ' చేశాడు. అందుకే వాడంటే అంత మురిపెం వాడుండగా సామేలుతో దెబ్బలాడనని, వాడెదురుగా ఏడవనని ఒట్టెట్టుకుంది. అదీ సామేలుకే మంచిదయ్యింది. చిన్నా లేచి ఉన్నప్పుడే తన క్కావాల్సిన వన్నీ సాగించుకునేవాడు.

"అమ్మా! ఆకలి అన్నం పెట్టు." అంటూ లోపలికి వచ్చాడు చిన్నా.

ఈ లోకంలోకి వచ్చింది. సుక్క. వాడివాళ్ళంతా మట్టి, బురద సుక్క ఇంకా అన్నంవండలేదు. వండటానికేంలేదు. ఇంట్లో.

"రా చిన్నా! కాళ్ళూ చేతులూ కడుగుతా!"అంది.

"ఆకలే!ముందు తింటా! " గారాలు పోయాడు నాలుగేళ్ళ చిన్నా.

"మట్టిసేతుల్తో తింటే జొరం వస్తదిరా! నాయనా! నాకొండా!" అంటూవాడిని ముద్దు చేస్తూ బయటికి తీసుకెళ్ళి,పెద్ద తొట్టెలో పట్టి ఉంచిన నీళ్ళతో వాడి కాళ్ళు చేతులూ,మొహం కడిగి, చీర కొంగుతో తుడిచి బట్టలు మార్చింది. తెల్లగా కడిగి పెట్టిన సత్తు పళ్లెంలో చల్లని అన్నం పెట్టింది. అది తను పాచి పని చేసే ఒక ఇంటావిడ ఇచ్చింది. అందులోకి ఇంకో ఇంట్లో ఇచ్చిన ఊరగాయ పచ్చడినంచు కోటానికి వేసింది. గడప బయట వీధిలైటు వెలుతురులో అరుగుమీద కూర్చో పెట్టి పళ్లెం చేతికిచ్చింది. చిన్నా అన్నం పళ్లెం తీసు కోకుండా,

"అమ్మా! ఉడుకన్నం ఎట్టే సద్దితిన" అన్నాడు

"రేపు ఉడుకన్నం ఎడతాగా! ఇప్పుడిది తినెయ్యికొండా!" అంది సుక్కమనసులో బాధ బయట పడనీకుండా

"రేపు వద్దు ఇప్పుడే కావాలి."

"సరే! ఇది తింటూ ఉండు. పొయ్యరాజేస్తా అప్పటికి ఉడు కన్నం ఎడతా"

"ఊ! సరే! కూరెయ్యి పచ్చడికారం తిన"

"శానా బాగుంటది పచ్చమేడఅమ్మగారు నీకోసమే ఇచ్చారు. ఆళ్ళ బాబుకోసం చేశారంట తెలుసా?" మరిపించటానికి ఎంతో ప్రయత్నం చేస్తోంది సుక్కమ్మ. ఏదో రకంగా బతిమాలి తిని పించకపోతే, నీరసం వచ్చి ఇంకా చికాకు పెడతాడని భయం. వీధి దీపాన్ని చందమామని చూపించి"ఏది బాగుంది?" అని అడుగుతోంది. చిన్నా అన్నంమాట మర్చిపోయి తల్లితోపాటు తలపైకెత్తి వాటిని చూస్తు న్నాడు. సుక్కమ్మ చేతిలో పళ్ళెం ఎవరో లాక్కునట్లయ్యి ఉలికిపాటుతో చూసింది.ఎప్పుడొచ్చాడో ఏమో, నక్కలాగా గోడచాటున నక్కి ఇద్దరూ తలెత్తి చూస్తుండగా ఒడుపుగా పళ్ళెం లాగేశాడు సామేలు.

"నంజుడేంలేదు మద్దెమద్దె నమలటానికి అని తెగ బాదపడతన్నా. ఈ ఆవకాయ బద్దా సద్దన్నం ముందు ఏ సీకైనా దిగదిదుపే. ఏయ్ సుక్కీ ! పెట్టి పుట్టాలే దేనికైనా...." అంటూ అన్నం ఆవకాయ కలిపి తినేశాడు. ముక్క బుగ్గన పెట్టుకుని నములుతూ,

"ఏయ్! సుక్కీ! నీకు బాగా పొగరెక్కిందే! నేనడిగితే అన్నం వండలేదన్నావ్! ఇప్పుడెక్కడిదే? ఇంకా ఎక్కడ దాచావోతీసుకురా! లేకపోతే నేనేం చేస్తానో నీకు తెల్దు...."

"సుక్కమ్మ తెల్లబోయింది. భయానికి పేచీ పెట్టటం ఆపేసిన చిన్నా,అన్నం పెట్టమంటే ఇప్పుడెట్లా? .... ఈ దొంగ సచ్చినోడింత పని చేస్తాడని తనూహించలేదు. పిల్లాడికి పెట్టటానికి అన్నం మెతుకైనా లేదు.బెల్లం ముక్కైనా లేదు, పప్పు బద్ద అయినా లేదు. ...జ్వరం నుంచి ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నాడు. నీరసపడతాడు. సుక్కమ్మకి దుఃఖం వచ్చింది. ఉక్రోషం వచ్చింది. ఆవేశం వచ్చింది.

**ఇక్బాల్ జయంతి**

డా॥ మహమ్మద్ ఇక్బాల్ 9నవంబర్1877 న సియార్ కోటలో జన్మించారు. 1907లో జర్మనీలో Ph.D. చేశాడు. లాహోర్ విశ్వ విద్యాలయంలో ప్రొఫెసర్‌గా చేరారు. 'సారే జహాసే అచ్ఛా' అనే ఉర్దూ దేశభక్తి గీతం 'తరాన-ఎ-హింద్' అనే పేరుతో 1904లో రాశాడు. ఈ గీతం బాంగ్-ఎ-దర అనే కావ్యంలోనిది. మన దేశ సహజ సంపదలను వివరిస్తూ మత సామరస్యాన్ని జాతీయ సమైక్యతను ఈ గీతంలో చక్కగా బోధించాడు.

ఉద్రేకం పెచ్చు పెరిగింది.

"…….మాట్లాడవేమే? బెల్లంకొట్టిన రాయిలాగా నిలబడ్డావ్! సిల్లర సీమాలచ్మితో గొంతు పూర్తిగా తడవలేదు. నోట్లెక్కడ దాచావే?……"

సామేలు మీది మీది కొచ్చాడు. తనుపెట్టుకున్న ఒట్టుని మర్చిపోయింది సుక్కమ్మ.

'ఛీ! ఛీ!! పిలగాడి అన్నం తినేసిన నువ్వు మడిసివా? దెయ్యానివా?

### సి.పి.బ్రౌన్ జయంతి

సి.పి.బ్రౌన్ 10నవంబర్1978 కలకత్తాలోజన్మించారు. కలెక్టరుకు అసిస్టెంటుగా 1820లో కడప చేరుకున్నాడు. ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తూనే తెలుగు సాహిత్య సేవ చేశారు.వేమన పద్యాలను ఇంగ్లీషులోకి అనువదించాడు. నిఘంటువులను కూర్చాడు. 36 ఏళ్ళు మన దేశంలో ఉద్యోగం చేసి చివరి దశలో లండన్ విశ్వ విద్యాలయంలో ప్రొఫెసర్‌గా పని చేసాడు.

కొడుకు పుట్టిన తర్వాత తనని ఎదిరించని సుక్క అంతమాట అనేసరికి సామేలుకి కోపంతోపాటు ఆశ్చర్యం కూడా కలిగింది.

"ఎంతకి తెగించావే? నన్ను దెయ్యం అంటావా?….." కోపంతో ఊగిపోతున్నాడు. సుక్కమాటాడలేదు.

"……అంతావీడి మూలానే" అంటూ మీద మీదకి కొట్టటానికి వచ్చాడు. సుక్క సామేలు చెయ్యిపట్టుకుని,

"చంపుతా, నా బిడ్డమీద చెయ్యపడితే! పోరా! తాగుబోతెదవా"! అంటూ విదిలించి కొట్టింది.

సుక్కి రౌద్రరూపం చూసిన సామేలు ఇంక లాభం లేదనుకొని వీధిన పడ్డాడు. చిన్నా 'అయ్యా! అయ్యా! అంటూ వెంటపడ్డాడు. ఛీ!పో!" అంటూ వాణ్ణి తోసి ముందికి నడిచాడు సామేలు.

అరకొరమందు. అర్ధాకలి. సుక్కమ్మ చేసిన అవమానం మరిచిపోవాలంటే, సుక్కపడాల్సిందే మరోసారి. కాని ఎట్లా?…..

సారాకొట్టు సాయిబు నిన్ననే గట్టిగా చెప్పాడు. అరువియ్యనని. అందుకే చిన్నా మందులకని దాచిన చిల్లర తీశాడు. నవ్వొచ్చింది సామేలుకి, చిన్నా మందులకని దాచిన సిల్లర తన మందుకి పని కొచ్చిందని….. ఇప్పుడెట్లా?…..గొంతు పిడచకట్టుకుపోతోంది. మనసు పీకుతోంది వళ్ళంతా నీరసంతో స్వాదీనం తప్పుతున్నట్టుంది కాళ్ళూ చేతులు పీక్కుపోతున్నట్టున్నాయి. కాళ్ళీడుచుకుంటూ యధాలాపంగా నడుస్తున్నాడు. కాలికేదో తగిలినట్టై ముందుకి తూలాడు.

'ఛత్! రోడ్డుకూడా నన్ను అగమానం చేస్తోంది. దీనిపని పడతా!" అంటూ కిందికి చూశాడు. డ్రైనేజీని కప్పే పెద్ద ఇనపమూత అంతకుముందే అక్కడ మురికి కాలవ పూడిపోతే బాగుచేశారు కాబోలు పక్కన మురికి కుప్ప. మూత సరిగా పడలేదేమో ఒక కొసపైకి లేచి వుండి కాలికి తగిలింది.

"దీనిక్కూడా నేను చులకన అయిపోయాను" అని దాన్ని కాలితో తన్నాడు. అది ఇంకొంచెం లేచింది. కోపంగా రెండు చేతులతోనూ ఎత్తి అవతల పడెయ్యబోయాడు. అంతే! ఆగిపోయాడు.ఆ మూతని అట్లాగే ఎత్తిపట్టుకుని వేగంగా నడుచుకుంటూ పోయాడు. పాత సామాన్లు కొనే షాపు దగ్గిర ఆగిపోయాయి సామేలుపాదాలు.

సూర్యకిరణాలు మొహం మీద పడటంతో మెలకువ వచ్చింది. సామేలుకి వీధి పంపు దగ్గిర మొహం కడగటంతో మత్తు దిగిపోయింది. సుక్కమ్మ రౌధ్రరూపం గుర్తొచ్చి భయం వేసింది. కాని, సుక్కమ్మని దారిలోకి తేవటం తనకి చాలా తేలిక అని సామేలుకి ధైర్యం. పదేళ్ళనుంచి తనని సుక్కేపోషిస్తోంది. అడపాదడపా చిన్నా చితకా పనులు చేస్తే వచ్చేది తన తాగుడుకే చాలదు. అప్పుడప్పుడుచుక్క దాచిన చిల్లర కూడా తీసుకుంటాడు. పాపం! మంచిదే! అయినా వాడి మందుల కోసం దాచిన చిల్లర తనెట్లా తీసుకున్నాడు సిగ్గులేకుండా?

రాత్రి తను డ్రైనేజీ మూత తీసిన మాన్‌హోల్ దగ్గిరకొచ్చాడు. అటు పక్క చూశాడు. దానిమీద ఎవరో పెద్దపెద్ద రాళ్ళు పెట్టారు. ఎవరో

అంటున్నారు. "రాత్రి చిన్న కుర్రాడు అందులో పడిపోయాడు. పొద్దున్నే తీశారు" అని

"పాపం! ఎవరో?" అడుగుదామనుకున్నాడు సామేలు వెంటనే "మనకెందుకూ?" అనుకుని ఇంటివైపు నడిచాడు.

సందు మలుపు తిరగ్గానే తమ ఇరుకు సందుపట్టనంత మంది జనం.

"ఏమైందబ్బా? సినిమా షూటింగ్ ఏమైనా జరుగుతోందా? ఎవరైనా ఊరికే సారాయి పోస్తున్నారా?" అనుకున్నాడు సామేలు. కాని, ఎవరి మొహాల్లోనూ నవ్వు లేదు. ఏదో జరగరానిదే జరిగినట్టుంది. "పాపం! ఎవరో? ఏమిటో?" అనుకుంటూ నడుస్తూ, అందరూ పక్కకి తప్పుకుని తనకి దారి ఇవ్వటం గమనించలేదు. తన ఇంటి ముందుకి చేరేసరికి, చుట్టూ జనం మూగి ఉండటంతో ఏమీ కనపడటంలేదు కానీ, సుక్కమ్మ గొంతు వినపడుతోంది.

"......అయ్యో! నేనెట్టా బతికేది? ఆ గంగానమ్మ నన్నింత అన్నాయం చేస్తుందనుకోలేదు. ......గంగానమ్మ తల్లీ! నేన్నీకేం తక్కువ చేశాను? నేనేం పాపం చేశాను? నాకెందుకింత శిచ్చ?...." దుఃఖంతోనూ, ఏడ్చి ఏడ్చి గొంతు బొంగురుపోయింది. తను తాగి, చిన్నా అన్నం తిన్నందుకే ఇంత గొడవ చేస్తోందేమిటి? అని కోపంముంచుకొచ్చింది సామేలుకి... కోపంగా ఒక్క అడుగు ముందుకి వేశాడు. అంతే! అడుగు ముందుకి పడలేదు.

సుక్కమ్మశోకదేవతలాగా కూర్చుని ఉంది. ఆమెముందు వళ్ళంతా మురికి కొట్టుకుని పోయిన చిన్నా ప్రశాంతంగా పడుకుని ఉన్నాడు. ఉడుకన్నం కూరకావాలని ఇక అడగడు. వాడి వళ్ళంతా తడుముతోంది సుక్కమ్మ.

"చిన్నా! ఎంత అన్నాయం చేశావురా నన్ను?.... ఇచ్చిన గంగానమ్మే తోసుకుపోయింది. రా నిన్ను?...."

సుక్కమ్మ ఆగీ,ఆగీ ఏడుస్తూనే ఉంది. పక్కింటి మణిమ్మ సుక్కమ్మని పట్టుకుని ఓదారుస్తోంది. సామేలుని చూసింది.

"సుక్కమ్మా! సామేలు వచ్చాడు" అంది..

"ఆడెవడు? నా చిన్నాని చంపినోడు... ఆడిమొగంచూడను"

"ఆడుచంపటమేటీ? డెయినేజీ మూత తీసుంటే అందులో పడిపోయాడు కదే?..."

"ఆడి ఎనక ఎళితేనే అయింది చిన్నా నోటిముందు కూడు లాక్కున్నాడు. ఆడు మడిసికాదు. నాకంట పడితే సంపుతా!..."

ఆడపులిలాగా గర్జించింది. ఏడుపు ఎక్కడికి పోయిందో?

"తన ఎనకాలే వచ్చి తనుమూత ఎత్తుకెళ్ళిన డ్రైనేజీ గుంటలో పడ్డాడా తన చిన్నా?" సామేలు నిలబడలేక కూలబడ్డాడు.

"సుక్కా! తప్పుసేశానే! ఈ ఒక్కసారికీ నా తప్పుకాయవే? మళ్ళీంకెప్పుడూ సుక్కముట్టనే! చిన్నా మీద ఒట్టు......"

చిన్నా మీదపడి బావురుమన్నాడు. సుక్క భద్రకాళి అయింది.

"లే! నా చిన్నాని ముట్టకు నీ లాంటి తాగుబోతెదవ నా చిన్నాని ముట్టుకోకూడదు. లే!" గర్జించింది సుక్కమ్మ

పిల్లిలాగా లేచాడు సామేలు. అందరిమాటలు చెవులపడుతున్నాయి.

"ఛీ! తాగుడు ఈడిబతుకు బండలు చేసింది"

"కొడుకూ పోయాడు. కూడెట్టే పెళ్ళాం తరిమేసింది." కుక్కబతుకయ్యింది బతకడంకన్నా ఎందులోనన్నాపడి చావడం మంచిది.

"కొడుకు పడ్డడ్రైనేజీ మానోలు ఉందిగా" వినలేక చెవులు చిల్లులు పడుతున్నాయి.

అది తను తాగటానికి మూత అమ్మిన డ్రైనేజీగుంటకదా! ఆ మూత తీసి దానిని తెరిచి ఉంచింది తనేనని ఎవరికీ తెలియక పోయినా తనకితెలుసు.

అక్కడ నిలబడలేక గబగబా ఆగుంటవైపు నడిచాడు సామేలు.★